
ప్రజాశక్తి
మంగళవారం 25 మార్చి 2025
5
విజయనగరం



## ఎన్ఎడికి ఆరు గ్రామాల నుంచి భూసేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

బాడంగి మండలంలో నేవీ ఏర్పాటు చేయనున్న ఆయుధ డిపో కోసం ముగడ, కోడూరు, మల్లమ్మపేట, పాల్తేరు, రామచంద్రపురం, పూడివలస గ్రామాల నుంచి భూసేకరణ ప్రతిపాదనలు చేయనున్నట్లు ఆర్‌డిఒ రామ్మోహనరావు చెప్పారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆయుధ డిపోకు 1796.79 ఎకరాలు అవసరమని చెప్పారు. 183 ఎకరాలు నేవీ భూములు ఉన్నాయని, చెరువులు, సాగునీటి కాలువలు 122 ఎకరాలు, ఇతర భూములు 58 ఎకరాలు, డి-పట్టా 50 ఎకరాలు ఉన్నాయని చెప్పారు. రైతుల నుంచి మెట్టు 826 ఎకరాలు, పల్లం భూమి 558 ఎకరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆరు గ్రామాల పక్కనుంచి ఆయుధ డిపో ప్రహరీ వస్తుందని చెప్పారు. భూసేకరణకు ప్రభుత్వ ధరలతో 25 శాతం పెంచి నేవీ అధికారులకు ప్రతిపాదనలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల మంజూరు చేసిన వెంటనే భూసేకరణ ప్రారంభించి గ్రామాల్లో గ్రామసభలు పెడతామని వివరించారు.

# పల్లెపండగ పనులకు బిల్లుల గ్రహణం

- 1907 పనులకు 1374 పనులు పూర్తి
- బిల్లులు కాకపోవడంతో పనులు చేసేందుకు ముందుకు రాని వైనం



బిల్లులు అవ్వకపోవడంతో పెంటలో పనులు ప్రారంభం కాని రోడ్డు

***వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడిందని గగ్గోలు పెట్టి, తీవ్ర విమర్శలు గుప్పించిన టిడిపి కూటమి నేతలు పల్లెపండుగ పనులను సకాలంలో పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేసేందుకు గతేడాది నవంబర్‌లో ఆర్భాటంగా శంకుస్థాపన చేసేశారు. చివరికి బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పనులు చేపట్టేందుకు టిడిపి కూటమి నేతలు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో 50 శాతం కూడా ఖర్చు చేయని దుస్థితి ఏర్పడింది.***

ప్రజాశక్తి-బొబ్బిలి

విజయనగరం జిల్లాలో పల్లెపండగ పనులు 1996 మంజూరయ్యాయి. ఈ పనులకు ప్రభుత్వం రూ.141.64 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు 1439 పనులు పూర్తయ్యాయి. వీటి కోసం రూ.83.87 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటివరకు 1448 పనులకు రూ.67.82 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేసినప్పటికీ బిల్లులు మాత్రం 30 శాతం కూడా జమ చేయలేదని టిడిపి కూటమి నాయకులు చెబుతున్నారు. 553 పనులు పెండింగ్‌లో ఉండగా నాలుగు పనులు పూర్తిగా ప్రారంభం కాలేదు.



గున్నతోటవలసలో రోడ్డు పూర్తయినా బిల్లు కాని వైనం

**అప్పుల పాలు**

పల్లె పండుగ అభివృద్ధి పనులు చేసిన టిడిపి కూటమి నాయకులు అప్పుల పాలవుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపడితే బిల్లులు చెల్లించకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్‌లో రెండు విడతల్లో బిల్లులు చెల్లించారు. తర్వాత బిల్లులు మంజూరు చేయడం లేదు. ఆర్భాటంగా పనులను ప్రారంభించిన ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహించడంతో కాంట్రాక్టర్ల అవతారమెత్తిన టిడిపి కూటమి నాయకులు కారాలు మిరియాలు నూరుతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని టిడిపి కూటమి నేతలు కోరుతున్నారు.

**బొబ్బిలిలో ఖర్చు రూ.16 కోట్లు.. చెల్లింపు రూ.2.50 కోట్లు**

బొబ్బిలి నియోజకవర్గంలో 310 పనులకు రూ.16 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకు రూ.2.50 కోట్లు మాత్రమే బిల్లులు జమయ్యాయి. ఇంకా రూ.13.50 కోట్ల బిల్లులు మంజూరు కాలేదు. దీంతో పనులు చేపట్టిన టిడిపి నాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉందని కూటమి నాయకులు వాపోతున్నారు.

**నియోజకవర్గాల వారీగా చేపట్టిన పనుల పరిస్థితి ఇదీ**

| నియోజకవర్గం | మంజూరైన పనులు/నిధులు | కొనసాగుతున్న పనులు/నిధులు | పూర్తయిన పనులు/నిధులు | బిల్లుల నమోదు పనులు/నిధులు |
|---|---|---|---|---|
| బొబ్బిలి | 384 | 78 | 306 | 310 |
| | 26.96 కోట్లు | 7.97 కోట్లు | 18.98 కోట్లు | 15.91 కోట్లు |
| శృంగవరపుకోట | 385 | 115 | 270 | 243 |
| | 21.66 కోట్లు | 7.18 కోట్లు | 15.47 కోట్లు | 11.72 కోట్లు |
| చీపురుపల్లి | 264 | 74 | 190 | 196 |
| | 17.94 కోట్లు | 5.36 కోట్లు | 12.58 కోట్లు | 9.17 కోట్లు |
| నెల్లిమర్ల | 215 | 65 | 149 | 145 |
| | 20.24 కోట్లు | 11.36 కోట్లు | 8.74 కోట్లు | 9.17 కోట్లు |
| గజపతినగరం | 116 | 20 | 93 | 97 |
| | 19.03 కోట్లు | 93 లక్షలు | 6.61 కోట్లు | 6.58 కోట్లు |
| రాజాం | 397 | 106 | 291 | 313 |
| | 21.29 కోట్లు | 7.76 కోట్లు | 13.53 కోట్లు | 10.14 కోట్లు |
| విజయనగరం | 148 | 73 | 75 | 76 |
| | 9.65 కోట్లు | 4.58 కోట్లు | 5.06 కోట్లు | 2.94 కోట్లు |
| మెంటాడ | 87 | 22 | 65 | 68 |
| (సాలూరు నియోజకవర్గం) | 4.83 కోట్లు | 1.97 కోట్లు | 2.86 కోట్లు | 2.16 కోట్లు |

## పిజిఆర్ఎస్‌కు 275 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు 275 వినతులు అందాయి. అధికంగా రెవిన్యూ శాఖకు 117, మున్సిపల్ శాఖకు 17, ఉపాధి హామీకి 11, దేవాదాయ శాఖకు 46, పోలీస్ శాఖకు 31, డిఆర్‌డిఎకు 19, జిల్లా పంచాయతీ శాఖకు 10, విద్యుత్ పంపిణీ సంస్థకు 5, వైద్య ఆరోగ్యశాఖ 5, పాఠశాల విద్యాశాఖకు 4 చొప్పున వినతులు అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి. వినతులను సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీలా గాంధీ స్వీకరించారు.

**బాలికల గిరిజన ఆశ్రమం పాఠశాల ఏర్పాటు చేయాలి**

రాజాంలో గిరిజన ఆశ్రమం పాఠశాల, కొత్తవలస మండలం కొత్తవలసలో బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని ఆదివాసి ఐక్య కార్యాచరణ సమితి కార్యవర్గ సభ్యులు దుక్క సీతారాం అధికారులను కోరారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలో గల వివిధ పంచాయతీలకు సంబంధించిన గిరిజన విద్యార్థులు 200 మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, గిరిజన విద్యార్థులు చాలామంది డ్రాప్ అవుట్స్‌గా మిగిలిపోతున్నారని తెలిపారు. కాబట్టి గిరిజన ఆశ్రమ పాఠశాల 5 వతరగతి నుండి 10 వ తరగతి మంజూరు చేయాలని కోరారు. 250 మంది గిరిజన బాలికలు గ్రామంలో వివిధ గ్రామాల నుండి దూర భారం కావడం వల్ల పూర్తిగా విద్యాభ్యాసం చేయలేకపోతున్నారని, బాలికల ఆశ్రమ పాఠశాల మంజూరు చేయాలని కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి సేతుమాధవన్

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**భగత్ సింగ్ స్ఫూర్తితో సమసమాజం కోసం పోరాటం : ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఎజి ఎల్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్.. అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీర కిషోరాలని అన్నారు. బ్రిటిష్ వారి ప్రమాదకరమైన చట్టాలను వ్యతిరేకిస్తూ భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని పోరాడారన్నారు. భగత్‌సింగ్ పేరు వింటే చాలు భారతీయుల నరాల్లో నెత్తురు ఉడుకుతుందన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడ గడలాడించి యువకులను, విద్యార్థులను స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములు చేసిన ఘనత వీరేదని అన్నారు. వీరి స్ఫూర్తితో విద్యార్థులంతా రక్తదాన చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు. ఖాళీ పోస్టుల భర్తీకోసం, విద్య, వైద్యం కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, అన్నింటిలో సమాన అవకాశాలు కల్పించేలా సోషలిస్టు వ్యవస్థ కోసం ఉద్యమాలు నిర్వహించడమే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అర్.శిరీష, ఎస్.సోమేష్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, రాజు, నాయకులు శివ,మురళీ,విజయ్,పండు, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**భగత్‌సింగ్ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణకు ఉద్యమించాలి**

దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అన్నారు . సోమవారం ఎల్ బి జి భవనంలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. మతోన్మాద శక్తులు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో ప్రజలు దేశ వ్యాప్తంగా దేశ రక్షణకు, మత సామరస్యం కోసం, రాజ్యాంగ రక్షణ కోసం , యువత కి ఉపాధి అవకాశాలు కల్పించాలని పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్ పాల్గొన్నారు.






ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, పాల్ట్రీ కార్మికులు

## తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

**కలెక్టరేట్ వద్ద వెంకట్రామ పౌల్ట్రీ కార్మికుల ధర్నా**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చీపురుపల్లి మండలం కర్లాం, అలజంగి గ్రామాల వద్ద వెంకట్రామా పౌల్ట్రీలో పరిశ్రమలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, స్థానిక యువతకే 75శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ వెంకట్రామ పౌల్ట్రీస్ వర్కర్స్ ఫెడరేషన్ ( సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు టివి రమణ, బి.గౌరి నాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు గురునాయుడు, ఈశ్వరరావు మాట్లాడుతూ 2011లో వెంకట్రామ యాజమాన్యం పౌల్ట్రీని పెట్టిందని, ప్రారంభంలో మొత్తం పని స్థానికులే చేసేవారని తెలిపారు. కానీ గత 3,4 సంవత్సరాలుగా స్థానికులను ఒక్కొక్కరినీ తొలగిస్తూ ఒరిస్సా, ఛతీస్ ఘడ్, భీహార్లకు చెందిన స్థానికేతరులను తెచ్చి పనిచేయిస్తున్నదని, అందులో భాగంగానే స్థానికులను అక్రమంగా తొలగిస్తోందని అన్నారు. అధికారులు వెంటనే కలుగజేసుకొని అక్రమంగా తొలగించిన కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని, చట్టం ప్రకారం ఈ పౌల్ట్రీలో 75 శాతం ఉపాధి స్థానిక యువకులకు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంకట్రామ పౌల్ట్రీస్ యాజమాన్యం వద్ద 2021 నవంబర్ 1 నుండి మూడళ్ల లీజుకు హొలోసిన్ కంపెనీకి ఇచ్చినట్లు చెబుతోందని, అందులో పనిచేస్తున్న వారిని తొలగిస్తున్నట్లు యాజమాన్యం చెబుతోందని, ఇది వాస్తవం కాదని అన్నారు. యాజమాన్యం చెప్పినట్లుగా ఇక్కడ హొలోసిన్ కంపెనీ బోర్డు ఎక్కడా కనిపించదన్నారు. ఎవరికైనా పని కావాలంటే ఛత్తీస్‌ఘడ్‌లో ఉన్న తన కంపెనీకి రమ్మని చెబుతున్నదని, అసలు ఛత్తీస్‌ఘడ్ వారే వచ్చి ఇక్కడ 3వందల మంది పనిచేసే ఇక్కడ వారిని అక్కడికి రమ్మని చెప్పడం అన్యాయమని అన్నారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలనే చట్టాన్ని అమలు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు.



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు

## మైన్స్ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి-వేపాడ

మైన్స్ అధికారుల తీరుపై ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం మండలంలోని బొద్దాంలో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ మాట్లాడుతూ పొలాలకు, నిర్మాణంలో ఇళ్లలో వేసేందుకు మట్టిని తరలిస్తున్న వారిని మైనింగ్, చెక్‌పోస్టు సిబ్బంది అడ్డుకోవడం, డబ్బులు వసూలు చేయడం దారుణమన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు, రైతుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై జిల్లా మైనింగ్ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు చెక్‌పోస్టు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన వద్దకు మైన్స్ ఎడి మల్లేశ్వరరావు, సిబ్బంది చేరుకుని, వారితో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని చెప్పారు. దీనికి రైతులు, డ్రైవర్లు అంగీకరించక పోవడంతో ఎడి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చలుమూరి శ్యామ్, చెలికాని ముత్యాలు, గేదెల శ్రీను, తూర్పాటి సతీష్, జనపరెడ్డి శ్రీను, దళాయి శివ, అలమండ శివప్రసాద్, మజ్జి గంగరాజు, ద్వారపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమబోర్డు ఏర్పాటుకు రవాణా రంగ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో మహాధర్నాకు మద్దతుగా స్థానిక అంబేద్కర్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ. జగన్ మోహన్ రావు మాట్లాడుతూ స్వయం ఉపాధిగా బతుకుతున్న 10 కోట్ల మంది రవాణా రంగ కార్మికుల గొంతు నులిపే విధంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం మోటార్ వాహన చట్టంలో మార్పులు చేసిందన్నారు.అందులో భాగమే అగ్రిగేటర్స్ పేరుతో ఓబర్, ఓలా, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలు రవాణా రంగంలోకి ప్రవేశించాయన్నారు. వాటిని రద్దుచేసి కేరళ తరహాలో ప్రభుత్వమే ఒక యాప్ ను నిర్వహించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఢిల్లీలో ఈ ధర్నా జరుగుతుందన్నారు. వాహనాల ఫిట్నెస్, రెన్యువల్, రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు ఆర్టీవో ద్వారా నిర్వహించాలని, ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు, భాస్కర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ జంక్షన్ ఆటో స్టాండ్ యూనియన్ కార్యదర్శి రామారావు , నాయకులు భాస్కరరావు, ప్రసన్న, ఆనంద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి :** రవాణారంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని చర్చి సెంటర్లో సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లను నేరుగా పాత పద్ధతిలోనే రవాణా శాఖ నిర్వహించాలని, ప్రయివేట్ సంస్థలకు అప్పగించవద్దని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులపై విపరీతమైన జరిమానాలు విధించే జిఒ 21ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ నాయుడు, మోహన్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.





నిరసన తెలుపుతున్న రవాణారంగ కార్మికులు, సిఐటియు నాయకులు

## మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

**జిల్లా ప్రధానన్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి**

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. ఈనెల 24 నుంచి 28 వరకు 40 గంటల మీడియేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో న్యాయవాదులు ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వం అంశంపై తమిళనాడు రాష్ట్రానికి చెందిన రత్న తార, కేరళ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సిరాజ్ న్యాయవాదులకు శిక్షణ ఇస్తారని, మధ్యవర్తిత్వంలోని మెలకువలను నేర్చుకోవడం ద్వారా కేసులను చాలా సులభంగా పరిష్కరించవచ్చునని తెలిపారు. వ్యాజ్యాలను మానవతా దక్పథంతో పరిశీలించి ఉభయ పార్టీల ద్వారానే పరిష్కారం రాబట్టాలని న్యాయవాదులకు సూచించారు. ఈ మధ్యవర్తిత్వము వల్ల ఉభయ పార్టీలకు సమయం డబ్బు వృథా కాకుండా ఉంటుందని, కోర్టులో చాలా కాలంగా పెండింగ్లో ఉన్న కేసులకు పరిష్కారం చూపవచ్చునని సూచించారు. వ్యాజ్యాల పరిష్కారానికి రాజీ కూడా ఒక మార్గమేనని ఆయన స్పష్టం చేశారు. శిక్షణను అందిస్తున్న మాస్టర్ ట్రైనీస్ తో మాట్లాడి శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి

## హిజ్రాను హత్యచేసిన నిందితుడిని శిక్షించాలి

**విజయనగరం టౌన్** : ఈనెల 19న అనకాపల్లిలో దీపు అనే హిజ్రాను అతి కిరాతకంగా హత్య చేసిన నిందితుడు దుర్గాప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద హెల్పింగ్ హ్యాండ్స్ అండ్ హిజ్రా అసోసియేషన్ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షులు కొండబాబు, అధ్యక్షప్రధాన కార్యదర్శులు మీనాకుమారి, స్రవంతి మాట్లాడుతూ ఇంతటి దారుణానికి పాల్పడిన నరరూప రాక్షసుడు దుర్గా ప్రసాద్ అలియాస్ బన్నిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీపు హత్య కేసును త్వరితగతిన విచారణ చేయడానికి ఫాస్టు ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాంజెండర్ ప్రొటెక్షన్ సెల్ విభాగాన్ని మరంత బలోపేతం చేస్తూ సంఘటన ఏదైనా జరిగినప్పుడు త్వరితగతిన విచారణ జరిపి తగు న్యాయం చేయాలన్నారు.

## 91 పోస్టులకు మెరిట్ జాబితా విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 20 కేటగిరీలలో మొత్తం 91 ఉద్యోగాలను భర్తీకి మెరిట్ జాబితాను పొందుపర్చినట్లు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. ఇందులో భాగంగా స్పీచ్ థెరపీ, ఒటి టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్ కేటగిరీలకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాలను ఆన్‌లైన్‌లో http://vizanagaram.ap.gov.in, http://vizianagaram.nic.in పొందుపర్చినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌కు లిఖితపూర్వకంగా ఆధారాలతో ఏప్రిల్ 1లోగా సమర్పించాలని తెలిపారు.

## గణితం పరీక్షకు 104 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు 104 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 22,890 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 22,786 మంది హాజరయ్యారని డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు 428 మందికి 354 మంది హాజరయ్యారరని తెలిపారు.

## బకాయి బిల్లులు చెల్లించి ఆదుకోండి

**కలెక్టరేట్ వద్ద రోడ్డు ఊడ్చుతూ కాంట్రాక్టర్ల నిరసన**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆరేళ్లగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని ఉత్తరాంధ్ర జిల్లాల కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం రోడ్డు ఊడ్చుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, నాయకులు శేషు, బంగార్రాజు, కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వేలాది మంది కాంట్రాక్టర్లు 20కి పైగా ఇంజనీరింగ్ విభాగాలలో వివిధ నిర్మాణ పనులలో నిమగ్నమై ఉన్నారన్నారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను ముఖ్యమంత్రి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా ఆరేళ్లగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈనెలాఖరు నాటికి బిల్లులు చెల్లించకపోతే తాము టెండర్లు వేయడం, పనులను చేయలేమని తెలిపారు. పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించడానికి వీలుగా సిఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో సాంకేతిక అడ్డంకులను తొలగించాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో మూడు జిల్లాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లంతా పాల్గొన్నారు.





రోడ్డు ఊడ్చుతూ నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

## 25, 26 తేదీల్లో ఎపిపిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 25,26 తేదీల్లో జరగనున్న ఎపిపిఎస్‌సి పరీక్షలకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై తమ ఛాంబర్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, 25,26 తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అనలిస్ట్ గ్రేడ్-2 ఉద్యోగాలకు, 26న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఎపిపిఎస్‌సి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనుందని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలు వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ఎంవిజిఆర్ కళాశాల, అయాన్ డిజిటల్, లెండి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులను ఉదయం 8 నుంచి 9 గంటలు వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటలు వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు.

హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకురావాలి చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఛీఫ్ సూపరింటిండెంట్లదే కీలక బాధ్యత అని డిఆర్‌ఒ తెలిపారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఇ లక్ష్మణరావు, పరీక్షల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ ఎం.బాలరాజు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కె.అనిల్ కుమార్, పోలీసు, రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ ప్రతినిధులు, ఛీఫ్ సూపరింటిండెంట్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

## చట్టపరిధిలో సమస్యలు పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాధితుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 42 మంది బాధితులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. అనంతరం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఫిర్యాదులను పరిశీలించి వాస్తవమైతే చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిసిఆర్‌బి సిఐ శంకర్రావు, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్



ఎమ్మెల్యే బేబినాయనకు వినతినిస్తున్న యుటిఎఫ్ నాయకులు

## యుపి పాఠశాలలను విలీనం చేయొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

యుపి పాఠశాలలు జిల్లా పరిషత్తు పాఠశాలల్లో విలీనం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయనకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, జిల్లా నాయకులు స్థానిక కోటలో సోమవారం వినతిపత్రం అందజేశారు. యుపి పాఠశాలలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో విలీనం అయితే పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతారని చెప్పారు. జిఒ 117ను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, రామకృష్ణ, శ్రీనివాస్, మహేష్, రామారావు, సత్యనారాయణ, సత్యమూర్తి పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా శివప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్



న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా పేడాడ శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 28న స్థానిక న్యాయ వాదుల సంఘ కార్యవర్గం ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి కలిశెట్టి రవి బాబు, ధవళ వెంకట రావు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి పేడాడ శివప్రసాద్ , పి బ్రహ్మాజీ, ఎం.సత్యనారాయణ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి పదవికి సారికి సతీష్, బర్నాల సీతారామరాజు నామినేషన్ వేశారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరిగింది. పోటీలో వున్న అభ్యర్థులు, పెద్దలు సహృద్భావ వాతావరణంలో చర్చలు జరిపారు. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న పి.బ్రహ్మాజీ, ఎం.సత్యనారాయణ రెడ్డి పోటీ నుంచి వైదొలగడంతో పేడాడ శివప్రసాద్ ఏకగ్రీవం ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి తెలిపారు. చర్చలు విఫలం అవడంతో అధ్యక్ష, సంయుక్త కార్యదర్శి పదవులకు పోటీ అనివార్యమైంది.

## వెంపడాం ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి -పూసపాటిరేగ



మండలంలోని వెంపడాం ఎంపిటిసి పిన్నింటి నిర్మల సోమవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం స్వగ్రామం వెంపడాంలో ఉంచారు. సోమవారం సాయంత్రం వెంపడాం శ్మశాన వాటికలో కుటుంబీకులు అంత్యక్రియలు జరిపారు. ఆమె నెల రోజులుగా అనారోగ్యంతో విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె గతంలో పూసపాటిరేగ జెడ్‌పిటిసిగా, వెంపడా సర్పంచ్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఆమె వెంపడాం ఎంపిటిసిగా ఉన్నారు. ఆమె భర్త పిన్నింటి వెంకటరమణ సర్పంచ్‌గా, ఎంపిటిసిగా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కుమారులున్నారు. చిన్న కుమారుడు పిన్నింటి కుమార్ ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. ఆమె మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాలర్పించారు.

## 27న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- రాజాం

పట్టణ పరిధిలో గల జిఎంఆర్ నైరేడులో ఈ నెల 27వ తేదీన 19 నుంచి 40 ఏళ్లలోపు గల వారికి ఉచిత శిక్షణ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నైరేడ్ నిర్వాహకులు తెలిపారు. పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్, సెల్ ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసింగ్, జెంట్స్ టైలరింగ్, హౌస్ వైరింగ్ కోర్సులు, మహిళలకు కంప్యూటర్ డిటిపి, లేడీస్ టైలరింగ్, మగ్గం వర్క్ అంటే సారీ పెయింటింగ్ వర్క్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత శిక్షణ, ఉచిత భోజనం, ఉచిత వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు https://forms.gleZ5wuGdBb7H4pcv3Q8 MT వెబ్ సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## హౌసింగ్ అధికారుల జాడేది? : సిపిఎం

ప్రజాశక్తి-బాడంగి

గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇళ్లకే పరిమితం అవుతున్నారని, కార్యాలయంలో కానరావడం లేదని సిపిఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ తెలిపారు. సోమవారం బాడంగిలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో చాలాచోట్ల గృహ నిర్మాణాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. వాటిపైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎఇని కలవడానికి ఎన్నిసార్లు వెళ్లినా కార్యాలయంలో కనిపించడం లేదన్నారు. మండలంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు ఉన్నారా? లేరా? అన్న అనుమానం కలుగుతోందని చెప్పారు. విధులకు డుమ్మా కొడుతున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు.

## మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులుగా మానస

ప్రజాశక్తి-బొబ్బిలి

మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులుగా పట్టణానికి చెందిన గోనా మానస ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో సోమవారం జరిగిన ప్రజా సంకల్ప వేదిక ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశంలో హైకోర్టు న్యాయవాది ఎం.రంగసాయిరెడ్డి సమక్షంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా కమిటీని 20 మందితో ఎన్నుకున్నారు. మానసకు పలువురు అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

**మెరకముడిదాం :** గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25, 26, 27తేదీలలో మూడు రోజులు పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ బి, పడాయి బి పథకంలో భాగంగా అంగన్‌వాడీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. బాల్య సంరక్షణ, విద్య, మెరుగైన పోషణపై శిక్షణ ఉంటుందని చెప్పారు.

## ఎమ్‌డిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భోగాపురం

మధ్యాహ్న భోజన పథక నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారి-2 బాలిపల్లి చంద్రమౌళికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రమాద, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించి ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. గ్రాడ్యుటీ చెల్లించి రాజకీయ వేధింపులు అరికట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రామ జ్యోతి, పిడుగు పార్వతి తదితర మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

## సింగరాయిలో బోరు ఏర్పాటు


ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సింగరాయి ఎస్‌సి కాలనీలో సోమవారం తాగునీటి బోరు ఏర్పాటుచేశారు. కాలనీలో తాగునీటి సమస్యపై సర్పంచ్ ఎన్.వెంకటరావు, సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. జెడ్‌పిటిసి శానాపతి అప్పలనాయుడుకు వినతి అందజేశారు. ఆయన స్పందించి తాగునీటి బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. దీంతో జెడ్‌పిటిసికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# విఆర్‌ఒ జాయినింగ్ రిపోర్టుపై కార్యదర్శి కొర్రీ

### 12 రోజులు పూర్తయిన ముందుకు కదలని ఫైల్

### అంబాడ పంచాయతీ కార్యదర్శి వ్యవహారంపై సర్వత్రా విమర్శలు



File No.REV-ASEC0LEV(ML)/2/2024-A1-COLSKLM

Rc.No.490/2024/A1, Date. 12/03/2025 Collector's Office, Srikakulam.

PROCEEDINGS OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE, SRIKAKULAM
PRESENT:: SRI SWAPNIL DINKAR PUNDKAR, I.A.S.,

Sub:Establishment – Erstwhile Srikakulam District – Village Revenue Officers – representation of Sri G.Ravi, VRO Grade.II, Pedda Sirlam Village Secretariat, Regidi Amadalavalasa Mandal – Proceeded on long leave w.e.f. 14.02.2023 onwards – Joined and request for posting orders – orders issued.

Read: 1. G.O.Ms.No.119 Finance (DCM-III) dept., dt.17.05.2013.
2. G.O.Ms.No.24 General Administration (SPF-MC) Dept., 06.04.2022.
3. Representation of Sri G.Ravi, VRO Grade.II, Pedda Sirlam Village Secretariat, Regidi Amadalavalasa Mandal Dt.14.03.2024
4. This office Rc.No.490/2024/A1, Dt.18.03.2024.
5. Rc.No.181/2024/A1, Dt.22.07.2024 of the Tahsildar, Regidi Amadalavalasa.
6. This office Rc.No.490/2024/A1, Dt.19.08.2024.
7. Rc.No.181/2024/A1, Dt.27.08.2024 of the Tahsildar, Regidi Amadalavalasa.

ORDER:

In the reference 3rd read above, Sri G.Ravi, VRO Grade.II, former Pedda Sirlam Village Secretariat, Regidi Amadalavalasa Mandal has submitted a representation stating that, he is on leave from 14.02.2023 due to his ill health and now, his health is fine and that requested to issue necessary posting orders.

In the circumstances reported by the Tahsildar, Regidi Amadalavalasa in the reference 5th & 7th read above and as per the Government orders in the references 1st &

కలెక్టర్ నుంచి పొందిన ప్రొసీడింగ్ కాపీ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబాడ సచివాలయం విఆర్‌ఒగా గుంట రవి ఈ నెల 12న కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రేడ్-2 విఆర్‌ఒగా బాధ్యతలు చేపట్టారు. అదే రోజు జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్ కాపీ, జాయినింగ్ రిపోర్టు రేగిడి తహశీల్దార్ చిన్నారావుకు, అంబాడ కార్యదర్శి శ్యామ్‌కు లిఖితపూర్వకంగా రాసి అందించారు. తహశీల్దారు అంబాడ పంచాయతీ కార్యదర్శి నుంచి జాయినింగ్ రిపోర్టు కావాలని అడుగగా విఆర్‌ఒ రవి ఎన్నిసార్లు కార్యదర్శిని అడిగినా ససేమిరా అని కాలయాపన చేస్తూ వస్తున్నారు. విఆర్‌ఒ జాయినింగ్ రిపోర్టు తాను ఇవ్వనని, తనకు ఏమీ తెలియదని కొర్రి వేస్తూ సమాధానం చెప్పడంతో స్థానిక తహశీల్దారుకు, ఎంపిడిఒ కార్యాలయం ఎఒ నాగమణికి విఆర్‌ఒ రవి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే 12 రోజులు పూర్తయిన ఇవ్వకపోవడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. విఆర్‌ఒగా గుంట రవి సమయాల బయోమెట్రిక్ మొబైల్లో వేస్తున్నప్పటికీ ఎందుకు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడం లేదో అర్థం కావడం లేదని రవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఉద్యోగికి జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్ కాపీ ఇచ్చిన 24 గంటల్లోగా జాయినింగ్ రిపోర్టు అందజేయాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటి వరకూ ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

### పంచాయతీ కార్యదర్శిపై అనుమానాలు

వాస్తవంగా పంచాయతీ కార్యదర్శి శ్యామ్ ఇంటి వద్ద నుంచి మొబైల్ ద్వారా బయోమెట్రిక్ వేసి తన సొంత పనులు చేసుకుంటున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు కొన్ని సందర్భాల్లో ఆఫీస్ డ్యూటీ అని చెప్పి బయోమెట్రిక్ వేసిన తరువాత విధులకు డుమ్మా కొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వేల పేరుతో తోటి సిబ్బందికి పనులు అప్పజెప్పి విధులకు డుమ్మా కొడుతున్నట్లు తోటి ఉద్యోగుల ద్వారా తెలిసింది. అందులో భాగంగానే విఆర్‌ఒ పదే పదే తన జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలని కోరినా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తెలిస్తోంది. ఈ విషయంపై ప్రజాశక్తి వద్ద విఆర్‌ఒ రవి తమ గోడును వినిపించుకోగా, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కు ఫోన్ చేయగా తాను జాయినింగ్ రిపోర్టు ఇవ్వనని పత్రికల్లో రాసుకుంటే రాసుకోండి అని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# గిరిజనులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తవలస

'మీ తరపున గతంలో ఎలా నిలబడ్డానో ఇప్పుడు మీ భూముల విషయంలోనూ అదేవిధంగా అండగా నిలుస్తాన'ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి... అప్పన్నదొరపాలెం గిరిజనులకు భరోసానిచ్చారు. మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామంలో తహశీల్దార్ నీలకంఠరావు ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభకు ఎమ్మెల్యేతోపాటు ఆర్‌డి డి.కీర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ గ్రామస్తులు ప్రతిపాదన అందిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగ్గరికి వారిని కూడా తీసుకెళ్లి, డిమాండ్లను తెలియజేద్దామని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఏకాభిప్రాయంతో సహకరించాలని కోరారు. రాజకీయాలు శాశ్వతం కాదని, మన ప్రాంత అభివృద్ధి మాత్రమే శాశ్వతమని తెలిపారు. కార్యక్రమంలో కాస్త గందరగోళం నెలకొన్నా, చివరికి గ్రామస్తులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో అప్పన్నదొరపాలెం సర్పంచ్ రాములమ్మ, ఎంపిటిసి ఉగ్గిన గురుజీ, గ్రామస్తులు నరసింగరావు, గిరి నాగరాజు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడతున్న ఎమ్మెల్యే లలితకుమారి

**పల్లపు కాలువ పనులు ప్రారంభం**

**జామి :** జామి పల్లపు కాలువ పనులను సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. కాలువలో పూడిక తీయించడంతోపాటు, కాలువ గట్లు పటిష్టతకు పనులు చేపట్టానున్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గత కొంతకాలంగా తాటిపూడి ఆయకట్టు నీరు తమ కాలువలకు అందడం లేదని, పల్లపు కాలువ మరమ్మతుల వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని వివరించారు. స్థానిక నాయకులకు చెప్పడంతో వెంటనే మీ దృష్టిలో పెట్టడం, ఆ వెంటనే కాలువ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం తమకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, రైతులు ఉన్నారు




సదస్సులో మాట్లాడుతున్న పోక్సోకోర్టు న్యాయమూర్తి నాగమణి

## లైంగిక వేధింపులపై అవగాహన తప్పనిసరి

### పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

లైంగిక వేధింపులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి అన్నారు. సోమవారం గురజాడ పాఠశాలలో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలు వారి కుటుంబాలకు, దగ్గరి వారినుండి ముప్పు పొంచి ఉందని తెలిసిన వారే నేరానికి పాల్పడుతున్నారని, వారినుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉపాధ్యాయులు మార్గదర్శకంగా విద్యార్థులను తీర్చి దిద్దాలని కోరారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన జి. హిమ బిందు మాట్లాడుతూ ప్రస్తుత జనరేషన్ పిల్లల్లో శారీరక మానసిక ఎదుగుదల, వారి వయసుకు మించి ఆడోళసెన్స్ స్టేజి ప్రారంభం అవుతుందని, తెలిసి తెలియని టీనేజ్ వయసులో లేనిపోని ఆకర్షణలకు గురవుతున్నారని అన్నారు. ఇంటర్నెట్ ప్రభావలకు లోనుకకుండా విద్యపై దృష్టి సారించాలన్నారు. దిశ పోలీసుస్టేషన్ ఎస్ఐ బి.భాగ్య మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.సత్యం, టి.రాజు మాట్లాడారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజి, పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్‌ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేనలో 40 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని వెదుళ్లవలస పంచాయతీకి చెందిన 40 కుటుంబాలు జనసేన పార్టీలో సోమవారం చేరాయి. వీరికి ఎమ్మెల్యే లోకం నాగ మాధవి జనసేన పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్ పాలూరి సత్తిబాబు, మరో ముగ్గురు వార్డు మెంబర్లుతో పాటు 40 కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, జనసేన సీనియర్ నాయకుడు చింతపల్లి రామ్మూర్తి, రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల :** బొప్పడాం నుంచి 30 కుటుంబాలు వైసిపిని వీడి జనసేనలో చేరాయి. సోమవారం ఎమ్మెల్యే లోకం మాధవి జనసేన కండువాలు కప్పి కొత్తగా పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోరాడ రమేష్, కరుమజ్జి గోవింద్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు బాధితులకు సహాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవర్చుకోవాలని విటి అగ్రహారం జెడ్‌పి హైస్కూలు హెచ్‌ఎం ఎస్ఎస్‌విఎస్ రాజేశ్వరావు అన్నారు. సోమవారం లెప్రసి బాధితుల కోసం విద్యార్థులు ఇచ్చిన రూ.21,475 విరాళాన్ని లెప్రా సొసైటీ ఫండ్రైసింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు హెచ్‌ఎం రాజేశ్వరావు అందజేశారు. హెచ్ ఎం మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందించించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. లెంక రమణ మాట్లాడుతూ జిల్లా కుష్ఠ నివారణ అధికారి సహకారంతో బాధితులకు అంగవైకల్యం నివారణకు రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కుష్ఠువ్యాధి బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదరక్షలు, సెల్ఫ్ కేర్ కిట్లు, ఫిజియో థెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై భోగాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం సోమవారం వేకువజామున పోలీస్ స్టేషన్ సమీపంలో వంతెన పై జరిగింది. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన తీగల నాని కుమార్(28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పని మీద విశాఖ వెళ్లి తిరిగి వస్తుండగా డివైడర్ ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అంబులెన్స్‌లో తగరపువలసలోని ఒక ప్రైవేట్ హాస్పటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయమే మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

## బెల్లం వ్యాపారులపై బైండోవర్ కేసులు

**బొబ్బిలి :** నాటుసారా నివారణకు బెల్లం వ్యాపారులపై ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. బెల్లం వ్యాపారులు నాటుసారాకు బెల్లం సరఫరా చేయకుండా ఉండేందుకు తహశీల్దార్ ఎం.శ్రీను ఎదుట బెల్లం వ్యాపారులను పెట్టి బైండోవర్ కేసులు నమోదు చేశారు. నాటుసారా తయారీకి బెల్లం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు హెచ్చరించారు. నాటుసారా నివారణకు సహకరించాలని కోరారు.

## క్షయ పట్ల అప్రమత్తం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరంకోట



విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎంహెచ్‌ఒ

క్షయ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జీవనరాణి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. క్షయనివారణ అధికారి కె.రాణి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సూర్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, డిఎంఒ డాక్టర్ మణి సంతోష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ' మన అందరి పంతం టిబి పంతం' అనే నినాదంతో స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ 2025 నాటికి క్షయను అంతం చేసే దిశగా కృషి జరుగుతోందన్నారు. టిబి రోగులు పూర్తికాలం మందులు వాడితే నయమవుతోందన్నారు. వారి పౌష్టికాహారం కోసం ప్రతినెలా వెయ్యి రూపాయలను వారి అకౌంట్లలో జమ చేస్తున్నామన్నారు. డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ జిల్లాలో వంద రోజుల ప్రోగ్రాం నిర్వహించామని, వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు

## మిమ్స్‌లో వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఆసుపత్రిలో వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు సోమవారం ఆసుపత్రి వర్గాల తెలిపాయి. గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన కొత్తింటి నారాయణమ్మ(70) తన ఇంటి వద్ద అత్యధిక కడుపు నొప్పితో బాధపడుతూ మిమ్స్‌లో చికిత్స కోసం చేరింది. వైద్యులు తనిఖీ చేయగా హెర్నియాతో బాధపడుతున్నట్లు గుర్తించారు. దీంతో మిమ్స్ ఆస్పత్రిలో జనరల్ సర్జరీ, ఎనస్థిసియా వైద్యులు ఆధ్వర్యంలో అతి క్లిష్టమైన, అరుదైన (Exploratory Laparotomy and Primary Repair of Defect and mesh placement) అనే శాస్త్ర చికిత్స చేశారు. కాగా ఇటువంటి శస్త్రచికిత్సా మొదటిసారిగా మిమ్స్ ఆస్పత్రిల్లో చేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్ డాక్టర్ కెసిటి నాయక్ (జనరల్ సర్జరీ), డాక్టర్ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్‌సిఎ నరసింహ రావు, ఎంఎస్‌ఎఫ్ ఆర్‌సిఎస్ హెచ్‌ఒడి డాక్టర్ కెవి వెంకటేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్, అనస్థీసియా వైద్య సహకారంతో నిర్వహించారు.

## ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు

ప్రజాశక్తి- రాజాం

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. మండలంలోని అంతకపల్లి గ్రామంలో సోమవారం 'జల జీవన్ మిషన్' పథకం ద్వారా వాటర్ ట్యాంక్ శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించే మహత్తర పథకం జల జీవన్ మిషన్ అని అన్నారు. మడ్డువలస ప్రాజెక్టు నుంచి ప్రతి గ్రామానికి మంచినీరు అందించాలని సంకల్పంతో రూ.800 కోట్లతో ప్రణాళికను సిద్ధం చేసామని, తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.18.21కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం అంతకాపల్లి గ్రామానికి చెందిన మధ్య సత్యంకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.73,770 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు బంగారయ్య

## బంగారయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తంగుడుబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశల గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్యకు అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య కళాక్షేత్రంలో 'సర్వేజనా సుఖినోభవంతు సంస్థ' వారు ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ చంద్రయ్య, ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్, డిస్ట్రిక్ట్ 320-ఎ లయన్ డాక్టర్ జి.మహేంద్రకుమార్ రెడ్డి, జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షులు, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మందడి కృష్ణారెడ్డి, సర్వేజనా సుఖినోభవంతు వ్యవస్థాపక అధ్యక్షులు ఈఎస్ సూర్యనారాయణ, ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, కూచిపూడి నాట్య గురుగులు కేంద్ర సంగీత నాటక అకాడమీ మెంబర్ న్యూఢిల్లీ కళా రత్న లయన్ డాక్టర్ ఎస్‌పి భరత్ చేతులు మీదుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం , ఉపాధ్యాయ రత్నా పురస్కారం అందించారు. బంగారయ్య ఏటా 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందించడం, గణితంలో నూరు శాతం ఫలితాలు సాధించడం, విద్యార్థులకు నగదు బహుమతులు అందివ్వడం, ఎంఎంఎస్ విద్యార్థులకు కూడా ఉచిత మెటీరియల్ పంపిణీ చేయడం, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన మెటీరియల్స్ ఇవ్వడం, వెనుకబడిన విద్యార్థులకు ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం, పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టినందుకు ఈ అవార్డులు ఆయనకు వచ్చినట్లు తెలిపారు.

## వైస్ ఎంపిపి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - భోగాపురం

ఈ నెల 27వ తేదీన జరగబోయే భోగాపురం మండల పరిషత్ వైస్ ఎంపిపి ఎన్నికకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఎన్నికల అధికారి, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఆర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల రోజు ఉదయం 10 గంటల లోపు పోటీ చేయబోయే వ్యక్తులు నామినేషన్ వేసుకోవాలన్నారు. అనంతరం స్క్రూట్ని నిర్వహించి బరిలో ఉన్న వారి వివరాలను ప్రకటిస్తామన్నారు. అనంతరం చేతులెత్తే ప్రక్రియ ద్వారా వైస్ ఎంపిపి ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే మండలంలో ఉన్న 16 మంది ఎంపిటిసిలకు నోటీసులు కూడా అందజేశామన్నారు. ఆ రోజు 144 సెక్షన్ అమలు చేయాలని భోగాపురం పోలీస్ స్టేషన్‌కు తెలియజేశామన్నారు. అనంతరం విప్ జారి విషయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ఒక రోజు ముందు 26వ తేదీన ఆయా పార్టీలకు చెందిన ఎంపిటిసిలకు విప్ జారీ చేసుకోవచ్చని అన్నారు. విప్ జారీ చేసిన అనంతరం సంబంధిత పత్రాలను తమకు అందజేయాలని సూచించారు. ఎంపిడిఒ కె.గాయత్రి, పరిపాలన అధికారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి సిబ్బంది మంచిమనసు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆర్‌టిసి సిబ్బంది మంచిమనసు చాటుకున్నారు. అల్లూరు సీతారామరాజు జిల్లా కించుమండ నుంచి శృంగవరపుకోట వస్తున్న ఆర్‌టిసి బస్సులో అనంతగిరిలో బస్సు ఎక్కిన వ్యక్తి ఎస్.కోటలో దిగాడు. అతని పర్సు బస్సులో పడిపోవడంతో ఆర్‌టిసి సిబ్బంది డిపో మేనేజర్‌కు తెలియజేశారు. వెంటనే పర్సులో ఉన్న ఫోన్ నంబర్ ద్వారా పోగొట్టుకున్న ప్యాసింజర్‌కు ఫోన్ చేసి, విషయం చెప్పారు. ఆ పర్సును సోమవారం ఆ వ్యక్తికి అందజేశారు. ఆ పర్సులో రూ2,800 నగదు, ఎటిఎం కార్డులు ఉన్నాయి.

## బెట్టింగులపై లఘుచిత్రం భేష్

ప్రజాశక్తి - భోగాపురం

బెట్టింగులపై యువకులు తీసిన లఘు చిత్రాన్ని భోగాపురం సిఐ ఎన్‌వి ప్రభాకర్ సోమవారం మెచ్చుకున్నారు. మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన యువకులు ఈ లఘు చిత్రాన్ని తీశారు. యువత బెట్టింగులకు పాల్పడి చివరకు ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల రెండు రోజుల కిందట నుంచి ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌లకు పాల్పడితే ఎటువంటి ఇబ్బందులు పడాలనే దానిపై రాజు, శివకుమార్, వెంకటేష్ ప్రసాద్, శ్రావణ్ కుమార్ తదితర యువకులు లఘు చిత్రాన్ని తీశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బెట్టింగులకు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఇలాంటి లఘు చిత్రాలు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఎంతో దోహద పడతాయని అన్నారు.